సాక్షి ఖమ్మం

శనివారం । 15 । జూన్ । 2024



ఇటు ఆంగ్లం.. అటు తెలుగు

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ఇబ్బంది పడకుండా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో పుస్తకాలు ముద్రించారు. 8లో



కూలీల ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

అశ్వారావుపేటలో కూలీలు వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 26°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయమే ఎండ మొదలవుతుంది. మధ్యాహ్నానికి పెరిగినా సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

ఆయిల్‌పామ్ సలహా కమిటీలో వైరా ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రాందాస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న హెచ్‌ఓ వేణు

వైరా: రాష్ట్రస్థాయి ఆయిల్ సలహా రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటుచేయగా ఇందులో సభ్యుడిగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌కు స్థానం దక్కింది. ఈమేరకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వైరా ఉద్యానవన శాఖాధికారి(హెచ్‌ఓ) ఆకుల వేణు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు పెరిగేలా రైతులకు అవగాహన కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: యూనియన్ పబ్లిక సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ డీడీ విజయలక్ష్మి తెలిపారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఉన్న గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు స్టడీసర్కిల్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 62817 66534 సంప్రదించాలని సూచించారు.

చేపల పెంపకంలో వ్యాధుల నివారణే కీలకం



చేపపిల్లల పెంపకంపై వివరిస్తున్న శాస్త్రవేత్తలు

కూసుమంచి: చేపలకు వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడమే కీలకమని మండలంలోని పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. కేంద్రంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల మత్స్య రైతులకు ఇస్తున్న శిక్షణ శుక్రవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు రీ సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టమ్ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన మత్స్యకారులు చేపలు వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోగలిగితే లాభసాటిగా ఉంటుందని చెప్పారు. అశ్వారావుపేట ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శ్రీనివాసరావు చేప పిల్లల రవాణాలో తీసుకోవాల్సిన మెళకువలు, మత్స్య శాస్త్రవేత్త రవీందర్ మేతలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

ఐసెట్‌లో చిరుమర్రి యువతికి 10వ ర్యాంకు



రవళి

ముదిగొండ: ముదిగొండ మండలం చిరుమర్రికి బుదారపు రవళి బ్యాంకులో ఉద్యోగం చేస్తూనే... పట్టుదలతో చదివి ఐసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన బుదారపు నాగేశ్వరరావు – అరుణ దంపతుల కుమార్తె రవళి బీటెక్ పూర్తిచేశాక మహబూబ్‌నగర్‌లోని ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఆ ఉద్యోగంతో సంతృప్తి చెందని ఆమె ఎంబీఏ చేయాలనే లక్ష్యంతో ఐసెట్‌కు సిద్ధమైంది. ఇటీవల పరీక్ష రాయగా, శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో 140.94 మార్కులతో రాష్ట్ర స్థాయి పదో ర్యాంకు సాధించింది. ఎంబీఏ ఫైనాన్స్ చేయాలనే లక్ష్యంతో కష్టపడినట్లు చదివానని చెబుతున్న రవళిని తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు అభినందించారు.

స్వర్ణకవచ ధారణలో రామయ్య

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామ చంద్రస్వామి వారిని శుక్రవారం అర్చకులు స్వర్ణకవచాలతో అలంకరించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామికి ప్రత్యేక పూజలు చేశాక స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించారు. ఆ తర్వాత నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఆశల పల్లకీలో...

త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ!

- కాంగ్రెస్‌లో ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు
- రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులపై పలువురు నేతల కన్ను
- జిల్లా స్థాయి పదవులపై ఇంకొందరి ఆశలు
- మంత్రులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైన నాయకులు



పదవి దక్కించుకునేందుకు..

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గతంలో ఉన్న కొన్ని కార్పొరేషన్, నామినేటెడ్ పదవులను రద్దు చేసింది. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఈ పోస్టులు కట్టబెడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈక్రమాన ఆశావహులు పదవులు దక్కించుకునే పనిలో పడ్డారు. జిల్లాలోని ముగ్గురు మంత్రులతోపాటు ఎంపీ రేణుకాచౌదరి వర్గానికి చెందిన నేతలు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు మొదలు మార్కెట్ కమిటీలు, ఆలయ కమిటీలు, గ్రంథాలయ సంస్థలే కాక ఇంకొన్ని నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఎన్నికల కోడ్ ముగిశాక నామినేటెడ్ పోస్టుల భర్తీ ఉంటుందని ముఖ్యమంత్రి గతంలో ప్రకటించగా.. ఇప్పుడు ఆ సమయం వచ్చేసింది. దీంతో ఆశావహులు తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. లోక్‌సభ ఎన్నికల ముందు ఉమ్మడి జిల్లా నుంచి పొదెం వీరయ్య, రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, నూతి శ్రీకాంత్, నాయుడు సత్యనారాయణకు నామినేటెడ్ పోస్టులు దక్కాయి. అయితే, వీరు ఇంకా ప్రమాణస్వీకారం చేయకున్నప్పటికీ రెండో దశలో మిగిలిన ఆశావహులు పదవుల కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే ఐదుగురికి రాష్ట్ర స్థాయి పోస్టులు వచ్చిన నేపథ్యాన ఇంకా ఒకరిద్దరికి అవకాశముంటుందని ఆశిస్తున్నారు.

జాబితా పెద్దదే...

దాదాపు పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవులను దక్కించుకోవాలనుకుని ఆశావహులు భారీగానే పోటీ పడుతున్నారు. త్వరలోనే పదవుల భర్తీ జరగనుందనే ఊహాగానాలతో నాయకుల్లో ఉత్సాహం రెట్టింపైంది. రాష్ట్ర, జిల్లాస్థాయి పదవులకు డిమాండ్ నెలకొంది. అయితే, కొందరు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతుండగా.. ఇంకొందరు మాత్రం నామినేటెడ్ పదవులపైనే కన్నేసినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కష్టపడిన తమకు పదవులు కట్టబెట్టాల్సిందేనని పలువురు నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

పొంగులేటి వర్గంలో పోటాపోటీ

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు చాలామంది నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. వైరా నియోజకవర్గం నుంచి బొర్రా రాజశేఖర్, మధిర నియోజకవర్గంలో డాక్టర్ కోట రాంబాబు, ఐలూరు వెంకటేశ్వరరెడ్డి, వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్, ఖమ్మం నియోజకవర్గం నుంచి నిరంజన్‌రెడ్డి, పినపాక నియోజకవర్గంలో తుళ్లూరి బ్రహ్మయ్య, బి.విజయ్, కొత్తగూడెం నియోజకవర్గంలో నాగ సీతారాములు, ఎడవల్లి కృష్ణ, తూము చౌదరి, ఇల్లెందులో మేకల మల్లిబాబుయాదవ్, మూల మధుకర్‌రెడ్డి, పాలేరు నియోజకవర్గంలో కన్నెగంటి శివరామకృష్ణ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

భట్టి వర్గం నుంచి పలువురు..

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వర్గానికి చెందిన నేతలు పలువురు సైతం పదవుల కోసం ప్రయత్నాలు చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మధిర నియోజకవర్గం నుంచి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మందడపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, పైడిపల్లి కిషోర్, ఖమ్మం నియోజకవర్గం నుంచి మహమ్మద్ జావేద్, కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోట్ల నాగేశ్వరరావు, ఏనుగుల అర్జున్‌రావు, ఇల్లెందు నియోజకవర్గం నుంచి డాక్టర్ జి.రవి పదవులు ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

తుమ్మల, రేణుక వర్గాల్లో అదే జోరు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోపాటు రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరిని నమ్ముకున్న పలువురు నేతలు, కార్యకర్తలు సైతం పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఖమ్మం నియోజకవర్గంలో తుమ్మల వర్గానికి చెందిన కమర్తపు మురళి, సాధు రమేష్‌రెడ్డి, పాలేరులో పొంగులేటి, తుమ్మల వర్గానికి చెందిన రామసహాయం వెంకటరెడ్డి, పినపాక నియోజకవర్గం నుంచి బి.విజయ్‌గాంధీ పదవులపై కన్నేశారు. ఇక వైరాలో రేణుకాచౌదరి వర్గానికి చెందిన కట్ల రంగారావు, సత్తుపల్లి నియోజకవర్గంలో నున్నా రామకృష్ణ, కోటూరి మానవతారాయ్, పాలేరు నియోజకవర్గంలో ధరావత్ రామ్మూర్తినాయక్, ఇల్లెందు నియోజకవర్గంలో ఎంపీ బలరాంనాయక్ వర్గానికి చెందిన చీమల వెంకటేశ్వర్లు తదితరులు నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న వారిలో ఉన్నారు. వీరిలో చాలా మంది రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవుల కోసమే ప్రయత్నాలు చేస్తుండగా, ఎందరికి దక్కుతాయో వేచి చూడాల్సిందే.

ఆ ముఠాల పనేనా?!

- రైళ్లలో చోరీలపై ముమ్మరంగా దర్యాప్తు
- రెక్కీ నిర్వహించి మరీ సిగ్నల్ ట్యాంపరింగ్‌తో ఎక్స్‌ప్రెస్‌ల నిలిపివేత
- పార్థీ, ఉండు గ్యాంగ్‌లు రంగంలోకి దిగినట్లు అనుమానాలు
- సిబ్బంది కొరతతో నామమాత్రంగా జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ తనిఖీలు



చింతకాని స్టేషన్ సమీపాన పరిశీలిస్తున్న రైల్వే ఎస్పీ సలీమా, వైరా ఏసీపీ రహమాన్ తదితరులు

మధిర/ఖమ్మంక్రైం/చింతకాని: జిల్లాలోని చింతకాని వద్ద రైళ్లను ఆపి ప్రయాణికుల సొత్తును దుండగులు దోచుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కొద్ది వ్యవధిలోనే సిగ్నళ్ల ట్యాంపరింగ్ ద్వారా రెండు రైళ్లను ఆపిన వారు గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులు తేరుకునేలోగా చోరీ చేసిన ఘటన గురువారం తెల్లవారుజామున జరిగిన విషయం తెలిసిందే. అయితే, చోరీ జరిగిన సమయాన ఇదే మార్గంలో పలు రైళ్లు వెళ్లినా పోలీసు ఎస్కార్ట్ లేని రైళ్లనే ఎంచుకోవడం, సిగ్నళ్లు ట్యాపరింగ్ చేయడం వంటివి పరిశీలిస్తే ఇక్కడి దుండగుల పని కాదని... మహారాష్ట్రలోని పార్థీ లేదా బిహార్ రాష్ట్రం పాట్నా సమీపంలోని ఉండు ముఠాలు వచ్చి ఉండొచ్చనే అనుమానాలు పోలీసువర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

ఎస్కార్ట్ లేకపోతేనే....

చింతకాని రైల్వేస్టేషన్ మీదుగా సికింద్రాబాద్ వైపు వెళ్తున్న బీదర్, పద్మావతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో చోరీ జరిగింది. నలభై నిమిషాల వ్యవధిలో చోరీలు జరగగా... అదే మార్గంలో గౌతమి, సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లు సైతం కొద్ది తేడాతో వెళ్లాయి. కానీ అందులో పోలీస్ ఎస్కార్ట్ ఉండడంతో దోపిడీకి వచ్చిన వారు వీటి జోలికి వెళ్లలేదు. చింతకాని సమీపాన సిగ్నల్ డ్రాప్ కావటంతో తొలుత బీదర్ ఎక్స్‌ప్రెస్‌ను లోకో పైలట్ నిలిపివేశాడు. దీంతో దుండగులు నాలుగు బోగీల్లో చోరీ చేయగా.. కాసేపటికి సిగ్నల్ ఇవ్వడంతో రైలు కదిలింది. అప్పటికి రైలులోనే ఉన్న దుండగులు చెయిన్ లాగి దిగి వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసింది. ఆ తర్వాత పద్మావతి ఎక్స్‌ప్రెస్ రావాల్సి ఉండగా ఖమ్మం వైపునకు వెళ్లే గౌతమి ఎక్స్‌ప్రెస్ కోసం బోనకల్‌లో నిలిపారు. గౌతమి చింతకాని దాటాక పద్మావతి ఎక్స్‌ప్రెస్ రాగా ఆ రైలును నిలిపేసి చోరీ పాల్పడ్డారు. బీదర్, పద్మావతి రైళ్లలో చోరీ చేసిన దుండగులు గౌతమి రైలును పట్టించుకోవడం వెనుక ఆ రైలులో ఎస్కార్ట్ ఉన్న విషయాన్ని రెక్కీ ద్వారా గుర్తించడమే కారణమని తెలుస్తోంది. అంతేకాక నిందితులు చోరీకి రహదారి మార్గం ఉన్న ప్రదేశాలనే ఎంచుకున్నట్లు సమాచారం. రైలు ఆగగానే ముఠా సభ్యులు కొందరు రైళ్లలోకి ఎక్కగా.. మరికొందరు బయటి నుంచే కిటికీల పక్కన బెర్త్‌ల్లో నిద్రిస్తున్న వారి నుంచి నగలు లాక్కెళ్లినట్లు సమాచారం. బీదర్ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్–4, 5, 9, 10 బోగీలతోపాటు పద్మావతి లోని ఎస్–1, 2 బోగీల్లో చోరీ జరిగింది.

సరిపడా సిబ్బంది ఏరీ?

ఖమ్మం రైల్వేస్టేషన్ పరిధిలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది కొరత వేధిస్తోంది. జీఆర్పీ స్టేషన్‌లో 20 మంది సిబ్బందికి పది మంది విధులు నిర్వర్తిస్తుండగా వీరిలో ఏడుగురు మహిళలే ఉన్నారు. దీంతో ఎస్కార్ట్‌గా వెళ్లడానికి ముగ్గురికి మాత్రమే అవకాశముంది. గతంలో జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల నుంచి సిబ్బందిని జీఆర్పీ పోలీసులకు తోడు ఎస్కార్ట్‌గా పంపించేవారు. ఈ ఏడాది ఆ విధానం అమలుకాకపోవడంతో ఉన్న సిబ్బందే ఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి రైళ్లలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. కానీ ఆర్పీఎఫ్‌లోనూ 18మందే ఉండగా అందులో నలుగురు మహిళలే కావడంతో బందోబస్తు కష్టమవుతోంది. ఖమ్మం రైల్వే స్టేషన్‌లో అటు విజయవాడ, ఇటు సికింద్రాబాద్ వైపు వెళ్లే సుమారు 60 రైళ్లు ఆగుతాయి. వీటిలో రాత్రివేళ వచ్చివెళ్లే రైళ్లలో వరంగల్, విజయవాడ వరకు రైల్వే పోలీసులు ఎస్కార్ట్‌గా వెళ్లాల్సి ఉన్నా సిబ్బంది కొరతతో మూడు నుంచి ఐదు రైళ్లకే పరిమితమవుతున్నారు. మరోపక్క ఆర్పీఎఫ్ సిబ్బందికి మాత్రమే ఆయుధాలు కేటాయించగా జీఆర్పీ సిబ్బందికి ఆ వెసలుబాటు లేకపోవడంతో చోరీల వంటివి జరిగినప్పుడు అడ్డుకోవడం సాధ్యం కావడం లేదు.

సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు

చింతకాని స్టేషన్ సమీపంలో రెండు రైళ్లలో జరిగిన చోరీ జరగగా.. బాధితులు సికింద్రాబాద్‌లో ఫిర్యాదు చేశారని జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు తెలిపారు. సుమారు రూ.3లక్షల విలువైన సొత్తు చోరీ జరిగి ఉంటుందని తెలిసిందన్నారు. అయితే, సికింద్రాబాద్ నుంచి ఎఫ్ఐఆర్ కాపీలు వస్తే పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. కాగా, ఘటనల్లో పాల్గొన్న నిందితులు చింతకాని నుంచి వెంకటాయపాలెం వెళ్లే ప్రధాన రహదారి, చింతకాని, జగన్నాధపురం మీదుగా బోనకల్–ఖమ్మం ప్రధాన రహదారిపైకి చేరే అవకాశమున్నందున ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాల పుటేజీలను జీఆర్పీ పోలీసులు పరిశీలిస్తున్నారు. అలాగే, గతంలో పార్థీ ముఠా సభ్యులు ఖమ్మం జీఆర్పీ పోలీసులకు చిక్కగా.. వారు ఇప్పుడు జైలులోనే ఉన్నారా, విడుదలయ్యారా, చింతకాని ఘటనలతో వారికేమైనా సంబంధం ఉందా అనే కోణంలోనూ విచారణ చేస్తున్నారు.

ఆరేళ్ల తర్వాత...

మహారాష్ట్రలోని పార్థీ, బిహార్ రాష్ట్రం పాట్నా సమీపంలో ఉండు ముఠాలే ఇలాంటి దోపిడీలకు పాల్పడుతాయని గత కేసుల ఆధారంగా రైల్వే పోలీసులు భావిస్తున్నారు. కరోనాకు ముందు జిల్లాలో ఇలాంటి ఘటనలు జరగగా, మళ్లీ సుమారు ఆరేళ్లకు జరగడంతో అవే గ్యాంగ్‌లు వచ్చి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఏపీలోని నెల్లూరు–కావలి మధ్య ఎక్స్‌ప్రెస్ రైలులో ఇదే తరహా దోపిడీ జరగగా.. గురువారం తెల్లవారుజామున రెండు రైళ్లలో చోరీ చేశారు. దీంతో ముఠా సభ్యులు భారీ సంఖ్యలో తెలుగు రాష్ట్రాలకు వచ్చి ఉండొచ్చని భావిస్తున్నారు.

గతంలో జరిగిన ఘటనల్లో కొన్ని..

- 2016 ఏప్రిల్ 9న తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న పద్మావతి ఎక్స్‌పెస్‌లో ఒక మహిళ మెడలో బంగారు గొలుసును దుండగుడు చోరీ చేశాడు. ఎర్రుపాలెం సమీపాన రైల్వే గేట్ వద్ద ఈ చోరీ జరిగింది.
- ఇదే ఏడాది ఏప్రిల్ 11న మండల పరిధిలోని దెందుకూరు వద్ద నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్‌కు చెందిన దివ్య మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును ఓ వ్యక్తి లాక్కుని పారిపోయాడు. ఆమె కేకలు వేయడంతో సహచర ప్రయాణికులు చైన్ లాగగా రైలు నిలిచిపోయింది. ఆ వెనుకాల నిలిచిన జీటీ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కేందుకు నిందితుడు ప్రయత్నించినా రైల్వే కానిస్టేబుల్ కాల్పులు జరపగా పరారయ్యాడు.
- ఇదే ఏడాది మే 7న మధిర మండలం తొండల గోపవరం స్టేషన్ సమీపాన గేట్ వద్ద భగత్ కోటి ఎక్స్‌ప్రెస్‌లో చోరీ జరిగింది. రైలులో ప్రయాణిస్తున్న రాజస్తాన్‌లోని నాగూర్ ప్రాంతానికి చెందిన చెన్నైదేవి మెడలో నుంచి దుండగులు బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు.
- 2017 జూన్ 3న తొండల గోపవరం రైల్వే స్టేషన్ వద్దే అర్ధరాత్రి మూడు రైళ్లలో చోరీ జరిగింది. ట్రాక్ పక్కన సిగ్నళ్ల వైర్లు కత్తిరించిన దుండగులు 12.30నుంచి 2.30గంటల మధ్య నిలిచిపోయిన చార్మినార్, గరీబ్‌రథ్, గౌతమి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సుమారు రూ.4 లక్షల విలువైన బంగారు ఆభరణాలను లాక్కుని పరారయ్యారు.
- 2018 ఏప్రిల్ 14న రాత్రి సికింద్రాబాద్ – తిరుపతి పద్మావతి రైలు మధిర స్టేషన్‌లో ఆగినప్పుడు ఎక్కిన పలువురు మధిర మండలం బయ్యారం సమీపానికి వెళ్లాక చైన్ లాగి నిలిపేశారు. అక్కడ ఓ దుండగుడు బోగీలోని మహిళ మెడలో గొలుసు లాగే ప్రయత్నం చేయగా రైల్వే కానిస్టేబుల్ రామకృష్ణ ఆయనను పట్టుకున్నాడు. అయితే, ముఠాకు చెందిన ఇంకొందరు అదే బోగీలో ఉండడంతో అంతా కలిసి కానిస్టేబుల్‌పై దాడి చేయగా గాయపడ్డాడు.

భూసేకరణలో వేగం పెంచాలి

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- రైల్వేలైన్లు, ప్రాజెక్టులపై అధికారులతో సమీక్ష

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియలో మరింత వేగం పెంచాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన రైల్వే, జాతీయ రహదారులు, నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మూడో రైల్వే లైన్‌కు సంబంధించి జిల్లాలో 4.11 హెక్టార్ల భూసేకరణ పూర్తిచేయాలని తెలిపారు. అలాగే, డోర్నకల్, కొత్తగూడెం స్టేషన్ల మధ్య డబ్లింగ్ లైన్‌కోసం సింగరేణి మండలం కమలాపురం, పోచారం, సింగరేణి, కారేపల్లి, కోమట్లగూడెం, రేలకాయలపల్లిల్లో 57.045 భూమి సేకరించాల్సి ఉందని తెలిపారు. అంతేకాక రఘునాథపాలెం మండలం పాపటపల్లి, చింతకాని మండలం బస్వాపురం, నాగులవంచ, పాతర్లపాడు, ఎర్రుపాలెం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి భూసేకరణ పూర్తిచేసి రైల్వే శాఖకు అప్పగించాలని సూచించారు. ఇంకా ఖమ్మం–దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ప్యాకేజీ–1 కోసం జిల్లాలో ఇంకా 40.1875 ఎకరాలు, ప్యాకేజీ–2లో 17.1450 ఎకరాలు, ప్యాకేజీ–3లో 12.2125 ఎకరాలే కాక సీతారామ ప్రాజెక్టులో ఏన్కూరు వద్ద 18 ఎల్ కెనాల్, బుగ్గవాగు ప్రాజెక్టులకు, మున్నేరు రిటైనింగ్ వాల్ కోసం 190.16 ఎకరాల భూసేకరణ త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. అంతేకాక పామాయిల్ పరిశ్రమ, రహదారుల విస్తరణ, ఆర్‌యూబీలు, గోదాంల నిర్మాణం, సింగరేణికి సంబంధించి జేవీఆర్, కిష్టారం ఓసీలకు కావాల్సిన భూసేకరణలోనూ వేగం పెంచాలని కలెక్టర్ తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్

సత్వరమే ధరణి దరఖాస్తుల పరిష్కారం

పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయన వీసీ ద్వారా సమీక్షిస్తూ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తుల రికార్డులు పరిశీలించి పరిష్కరించడమే కాక ఇతర దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని పేర్కొన్నారు. ఇందుకోసం మండలాల వారీగా అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ప్రతీ వారం నిర్వహించే ప్రజావాణిలో అందుతున్న దరఖాస్తులను కలెక్టర్లకు చేరవేయగానే ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని సూచించారు. ఇక భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్న నేపథ్యాన జిల్లాలో భూముల మార్కెట్ విలువ, రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో నివేదిక సమర్పించాలని తెలిపారు. ఈ వీసీకి జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రత్యేక డ్రైవ్ ద్వారా 3,500 దరఖాస్తులు, క్షేత్రస్థాయిలో పరిశీలించి 5వేల దరఖాస్తులు పరిష్కరించామని వెల్లడించారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఆర్డీఓలు జి.గణేష్, ఎల్.రాజేందర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, మైనింగ్ ఏడీ సాయినాథ్, కలెక్టరేట్ ఏఓ అరుణ పాల్గొన్నారు.

మూడు స్కూల్ బస్సులు సీజ్

తనిఖీలు ముమ్మరం చేసిన రవాణా శాఖ

ఖమ్మంక్రైం: గడువు ముగిసినా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ చేయించుకోకుండా నడిపిస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సులపై రవాణా శాఖ అధికారులు దృష్టి సారించారు. బస్సుల ఫిట్‌నెట్ సర్టిఫికెట్ల గడువు గతనెల 15న ముగియగా చాలా మంది రెన్యూవల్ చేయించుకోలేదు. ఈనేపథ్యాన పాఠశాలలు తెరవడంతో అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఖమ్మంలో ఎంవీఐ వెంకటరమణ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని ప్రైవేట్ పాఠశాలకు చెందిన మూడు బస్సులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడిపిస్తే సీజ్ చేయడంతో పాటు యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బస్సులో పరిశీలిస్తున్న ఎంవీఐ వెంకటరమణ

జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం

- రైతులకు అందుబాటులో అన్ని రకాల విత్తనాలు
- ఆయిల్‌పామ్‌లో హైబ్రిడ్ విత్తనాలు తెప్పిస్తాం
- జెడ్పీ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: సీతారామసాగర్ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలతో జిల్లాలోని ప్రతీ ఎకరా తడిపి సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలో జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని తెలిపారు. కాగా, ప్రకృతికి తోడు కల్తీ విత్తనాలు, మార్కెటింగ్ సమస్యలు వంటివి రైతులను వెంటాడుతున్నందున అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేసేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పథకం దుర్వినియోగమైనందున నిజమైన రైతులకే ఇవ్వాలని అందరూ కోరుతున్నారని తెలిపారు. దీంతో అందరి అభిప్రాయాలతో నిర్ణయం తీసుకుంటామని, పంటల బీమా పథకం ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రస్తుతం బయటపడిన గొర్రెల పథకం కుంభకోణం వంటివి గత ప్రభుత్వంలో అనేకం జరగగా రూ.వేల కోట్లు దుర్వినియోగం అయ్యాయని చెప్పారు. ఇక జిల్లా నేలలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నందున హైబ్రిడ్ విత్తనాల కోసం విదేశీ సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్నామని వెల్లడించారు. వీటి సాగుతో అంతర పంటలు వేసుకునే వెసులుబాటు కలుగుతుందని మంత్రి చెప్పారు. సమావేశం ప్రారంభంలో పెనుబల్లి, రఘునాథపాలెం, కారేపల్లి జెడ్పీటీసీలు మోహన్‌రావు, ప్రియాంక, జగన్, ముదిగొండ ఎంపీపీ హరిప్రసాద్ వ్యవసాయం, విద్యుత్ రంగ సమస్యలను ప్రస్తావించగా వ్యవసాయ శాఖాధికారులు, డీఈఓ సమాధానాలు ఇచ్చారు. అలాగే, మంత్రి తుమ్మలను జెడ్పీ చైర్మన్, చైర్మన్‌ను మంత్రి పరస్పరం సత్కరించారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓలు వినోద్, నాగలక్ష్మి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు, రేపు యూబీఐ మెగా రిటైల్ ఎక్స్‌పో

ఖమ్మంగాంధీచౌక్: ఒకే వేదికపై వినియోగ దారులకు అన్ని రకాల సేవలందించాలనే లక్ష్యంతో శని, ఆదివారం ఖమ్మంలోని దోరేపల్లి ఫంక్షన్ హాల్‌లో మెగా రిటైల్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) బ్యాంక్ డీజీఎం హన్మంతరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు రోజులు నిర్వహించే ఈ ఎక్స్‌పోలో గృహ, విద్య, వాహన రుణాలతో పాటు ఇతర రుణాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

గురుకులాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ


వంటలను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాలోని పలు గురుకులాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. గురుకులాల్లోని వంటగదులను పరిశీలించి అక్కడి భోజనాలు, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలతో కోదాడ క్రాస్ రోడ్డులో ఉన్న కూసుమంచి రెసిడెన్షియల్ స్కూల్, టేకులపల్లి రెసిడెన్షియల్ స్కూల్, బొమ్మ కళాశాలలోని తిరుమలాయపాలెం రెసిడెన్షియల్ స్కూళ్లలో తనిఖీ చేసినట్లు జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని


అభినయను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముదిగొండ: మహారాష్ట్రలోని పూణేలో జరగనున్న జాతీయస్థాయి రగ్బీ పోటీలకు మండలంలోని న్యూలక్ష్మీపురం కేజీబీవీ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని చల్లగొండ అబినయ ఎంపికైంది. హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈనెల 11, 12వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ – 18 జూనియర్ బాలికల పోటీల్లో పాల్గొన్న ఆమె ప్రతిభ కనబర్చగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 19, 20వ తేదీల్లో పూణేలోని బల్లెవాడలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్న అభినయను కేజీబీవీ ప్రత్యేకాధికారి ఇందిర, పీఈటీ నిర్మల, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

భూవివాదంలో ఇరువర్గాలపై కేసు

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణికి చెందిన గుంతేటి రాము, ఎర్రగడ్డ గ్రామానికి చెందిన మేడ బంగారి భూవివాదంతో ఘర్షణ పడగా ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రాము, బంగారి మధ్య భూవివాదం ఉండగా, ఎర్రగడ్డకు చెందిన బంగారి తరఫున సీపీఐ నాయకుడు బత్తుల రాధాకృష్ణ పెద్దగావ్యవహరించాడు. దీన్ని మనసులో పెట్టుకుని రాము, కృష్ణ, వెంకటేష్‌లు రాధాకృష్ణపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై గురువారం రాత్రి కేసు నమోదు చేయగా, రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాధాకృష్ణ, బంగారి ఆయన కుమారుడిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే, మండలంలోని బాలాజీనగర్‌తండాకు చెందిన భూక్యా వీరన్న, సక్రు, బలరాంతండాకు చెందిన కోటయ్య, రామచంద్రు మధ్య ఏర్పడిన గెట్టు తగాదాతో శుక్రవారం ఘర్షణకు పాల్పడ్డారు. ఈ ఘర్షణలో రామచంద్రు, ఆయన కుమారుడు నరేందర్, పెద్దమనిషిగా వెళ్లిన ధరావత్ వెంకన్నకు తీవ్ర గాయాలు కాగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని రోటరీ నగర్‌లో శుక్రవారం చోరీ జరిగింది. రోటరీ నగర్‌లో ఉన్న కిరాణ షాపునకు ద్విచక్రవాహనంపై వచ్చిన ఓ వ్యక్తి షాపు నిర్వాహకురాలు లక్ష్మిని పెరుగు ప్యాకెట్ కావాలని అడిగాడు. ప్యాకెట్ ఇస్తుండగానే ఆమె మెడలోని బంగారు నానుతాడు లాక్కుని పరారయ్యాడు. రూ.2.50లక్షల విలువైన గొలుసు చోరీపై బాధితురాలి ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు ఖమ్మం టూటౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో తీవ్రగాయాలు

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ సమీపాన శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో మత్కేపల్లికి చెందిన బొల్లికొండ వీరస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం కూరగాయల మార్కెట్‌లో హమాలీగా పనిచేస్తున్న వీరస్వామి ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుంచి మత్కేపల్లి వస్తుండగా పందిళ్లపల్లి రైల్వేస్టేషన సమీపాన బోనకల్ వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన తల, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఇటు ఆంగ్లం.. అటు తెలుగు!

ఎస్సెస్సీ విద్యార్థులకు ద్విభాషా పుస్తకాలు

- తెలుగు నుంచి ఇంగ్లిష్ మీడియంలోకి వచ్చిన విద్యార్థులకు ఉపయోగం
- ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేస్తున్న పాఠ్య పుస్తకాలు

కొణిజర్ల: పాఠ్యాంశాల రూపకల్పనలో ఏటేటా మార్పులు చేస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో విద్యాశాఖ సంస్కరణలు తీసుకొస్తోంది. ఇందులో భాగంగా గత ఏడాది 8, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్‌లో ముద్రించిన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయగా ఈసారి పదో తరగతి విద్యార్థులకు సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టినప్పటికీ అంతకు ముందు విద్యార్థులంతా తెలుగు మీడియంలో చదివి ఉండటంతో ఒకేసారి ఇంగ్లిష్‌లో పాఠాలను అర్థం చేసుకోలేకపోతున్నారని అధికారులు గుర్తించారు. దీన్ని అధిగమించడానికి ప్రభుత్వం ప్రతీ పాఠాన్ని తెలుగు, ఆంగ్లంలో ముద్రించి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇలా గణితం, ఫిజిక్స్, బయాలజీ, సాంఘిక శాస్త్రం పుస్తకాలను రెండేసి భాషల్లో ముద్రించి అందిస్తోంది.

రెండు భాగాలుగా..


పుస్తకాల్లో ప్రతీ పాఠాన్ని రెండేసి భాషల్లో ముద్రించారు. ఈ నేపథ్యాన గణితం, సాంఘికశాస్త్రం, సైన్స్ పుస్తకాలు మొత్తం చాప్టర్లను ఇలా ముద్రిస్తే పేజీల సంఖ్య పెరుగుతుందనే భావనతో రెండు భాగాలుగా ముద్రించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు ఎస్‌ఏ–1 పరీక్షల కోసం పార్ట్–1, నవంబర్ నుంచి మార్చి వరకు పార్ట్–2 పుస్తకం బోధించేలా విభజించారు. పాఠశాలలు పునఃప్రారంభమైన ఈ నెల 12నే ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈ పుస్తకాల పంపిణీ ప్రారంభించారు. తద్వారా తెలుగు మీడియం నుంచి వచ్చిన విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో సులువుగా రాణిస్తారని భావిస్తున్నారు. ఇక ఈ ఏడాది పంపిణీ చేస్తున్న పుస్తకాలను అందమైన కవర్ పేజీలతో తీర్చిదిద్దడమే కాక ప్రతీ పాఠంలో రంగురంగుల బొమ్మలు, పాఠానికి సంబంధించిన వీడియోల కోసం పక్కనే క్యూ ఆర్ కోడ్ సైతం ముద్రించారు. ఈ కోడ్‌ను మొబైల్ ఫోన్ ద్వారా స్కాన్ చేస్తే సంబంధిత వీడియో పాఠం వస్తుంది. ఈ విధానం కూడా విద్యార్థులకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా..



పాఠ్యపుస్తకాలు రెండు భాషల్లో ఉండటం ఉపయోగకరం. ఇంగ్లిష్ మీడియంలో వెనుకబడిన విద్యార్థులు పాఠాన్ని అవగాహన చేసుకోవడానికి తెలుగు మీడియంలో ముద్రించిన పాఠాలు ఉపయోగపడతాయి. తద్వారా మిగతా విద్యార్థులతో సమానంగా రాణించడం సాధ్యమవుతుంది.

–తాతా రామారావు, గణిత అధ్యాపకుడు


తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ముద్రించిన గణిత పుస్తకం

పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం..



అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ మొదలైంది. వంద శాతం మందికి నెలాఖరుకు లోగా పుస్తకాలు అందుతాయి. విద్యా సంవత్సరం తొలిరోజే పాఠ్యపుస్తకాలు ఇచ్చాం. ఈ ఏడాది హైస్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా నోట్ పుస్తకాలు కూడా సరఫరా చేసింది.

–ఎం.శ్యాంసన్, ఎంఈఓ కొణిజర్ల

కూలీల ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

ఇద్దరు మృతి.. 15 మందికి గాయాలు


ఘటనా స్థలంలో తిరగబడిన ట్రాక్టర్

అశ్వారావుపేట: మామిడి మొక్కలను రవాణా చేసేందుకు వచ్చిన కూలీలు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొనడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం అశ్వారావుపేట కోకోనట్ సీడ్ గార్డెన్, విజయదుర్గ అమ్మవారి ఆలయం మధ్య ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అశ్వారావుపేట పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు నర్సరీ వ్యాపారులు మొక్కలను ఒకరి నుంచి ఒకరు ఒక నెల రోజుల నుంచి రవాణా చేసుకుంటున్నారు. ఇందుకు గాను అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి గ్రామానికి చెందిన యాభై మంది వరకు ముఠాగా ఏర్పడి మొక్కల లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేసి పొట్టపోసుకుంటున్నారు. ఈ క్రమంలో నారంవారిగూడెం గ్రామానికి చెందిన ఓ నర్సరీ వ్యాపారి కొనుగోలు చేసిన మొక్కలను అశ్వారావుపేట వైపు నుంచి నారంవారిగూడెంనకు ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నారు. మొక్కలతోపాటు ముఠా కూలీలను కూడా అదే ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. సాయంత్రం సుమారు 4.50 గంటల సమయంలో ట్రాక్టర్ కోకోనట్‌సీడ్ గార్డెన్ దాటి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకునే సరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. కూలీలంతా రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయారు. వెనుక వరుసలో నిలుచుని ఉన్న వంటిపులి వెంకటలక్ష్మి(30) లారీ చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. మరో 18 మందికి తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని ట్రాక్టర్ ద్వారా అశ్వారావుపేట సీహెచ్‌సీకి తరలించారు. అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని నిలిచిపోయిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించి మృతదేహాన్ని మార్చురీకి చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బత్తుల దుర్గయ్య (65) మృతిచెందాడు. దేరంగుల అనిల్, కోటమ్మ, నాగమణి, మము ఎసలయ్య, దుర్గమ్మ, దేరంగుల స్వాతి, అలివేలు, సామ్రాజ్యం, నీరజ, నాగమల్లేశ్వరి, డి.వెంకమ్మ, దుర్గయ్య, కృష్ణమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారందరినీ సత్తుపల్లి, ఖమ్మం, కొత్తగూడెం ఆస్పత్రులకు తరలించారు.

కూలి కోసం వచ్చి..

ఘటనా స్థలంలో ప్రాణాలు విడిచిన వంటిపులి వెంకటలక్ష్మి కూలి పనులకు వెళ్లేది కాదు. ఇంటిలో ఆర్థిక పరిస్థితులు బాగోలేక.. శుక్రవారమే పనికి వచ్చింది. ఆమె పేదరికం ఆమె బిడ్డల పాలిట శాపమైంది. కుమారుడు, కుమార్తె తల్లిలేని వారయ్యారు. లారీ వేగంగా మీదకు దూసుకు వస్తోందని వెంకటలక్ష్మి కేకలు వేస్తున్నా.. ట్రాక్టర్ డ్రైవర్‌కు వినిపించలేదో.. వినిపించుకోలేదో.. ఆమె మొర ఎదురుగా ఉన్న అమ్మవారు సైతం ఆలకించలేదో మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చింది. నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినా.. ఇక్కడున్న అరకొర సౌకర్యాలు.. ఒకే ఒక డాక్టర్ సేవలు మరో ప్రాణాన్ని కాపాడలేకపోయాయి.

అది కుళ్లిన మాంసమేనట?

- గత నెల 26న ఖమ్మంలో తనిఖీలు, శాంపిళ్ల సేకరణ
- తాజాగా అందిన పరీక్షల నివేదిక

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలోని పలువురు హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు రోజుల తరబడి నిల్వ చేసిన, కుళ్లిన మాంసం, బూజు పట్టిన ఐస్‌క్రీమ్‌లు అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యాన ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టగా, గత నెల 26న ఖమ్మం కొత్త బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ఓ హోటల్‌లో చికెన్ వింగ్స్ శాంపిళ్లు సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. అయితే, ఆ మాంసం కుళ్లిపోయినట్లుగా నివేదిక జిల్లా అధికారులకు అందినట్లు తెలిసింది. సంబంధిత హోటల్ యాజమాన్యం, మేనేజర్, సిబ్బంది వివరాలతో కూడిన నివేదికను పంపించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం.

శాంపిళ్ల సేకరణ.. పరీక్షలు

ఉమ్మడి జిల్లాలో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీల సమయాన పలు హోటళ్ల నుంచి ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. అక్కడ పరీక్షల సందర్భంగా ఖమ్మం కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న హోటల్‌లో సేకరించిన చికెన్ వింగ్స్ కుళ్లిపోయినట్లు తేలగా.. మిగతా హోటళ్లలో సేకరించిన శాంపిళ్ల నివేదిక అందాల్సి ఉందని తెలుస్తోంది. కాగా, నివేదిక ఆధారంగా జిల్లా అధికారులు సదరు హోటల్ యజమాన్యానికి నోటీసులు జారీ చేసి 30 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించనున్నట్లు సమాచారం. అనంతరం వారు ఇచ్చే సమాధానం ఆధారంగా కేసు నమోదు చేస్తారని.. ఈ గడువులోగా సంబంధిత హోటల్ యాజమాన్యం శాంపిళ్లను ప్రైవేట్ ల్యాబ్‌లో పరీక్ష చేయించేందుకు అవకాశం ఇస్తారని తెలిసింది.

19, 20వ తేదీల్లో ఐజేయూ మహాసభలు

రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నగునూరి శేఖర్, విరాహత్ అలీ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్, పక్కన ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, నాయకులు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం కేంద్రంగా ఈనెల 19, 20వ తేదీల్లో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర తృతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నగునూరి శేఖర్, విరాహత్ అలీ తెలిపారు. ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పోరాటాల గడ్డ అయిన ఖమ్మంలో ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యాన రెండు సార్లు, ఇప్పుడు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మూడో సారి రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ఖమ్మంలోని ఉష కన్వెన్షన్ హాల్(కామ్రేడ్ అమర్‌నాథ్ ప్రాంగణం)లో జరిగే మహాసభల్లో గ్రామీణ విలేకరులకు కనీస హానరోరియం, వేజ్‌బోర్డు అమలు, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి 12 తీర్మానాలను ఆమోదించనున్నట్లు తెలిపారు. తొలిరోజు సభలను రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనుండగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మీడియా అకాడమీ చైర్మన్, ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. ముగింపు సభకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరవుతారని తెలిపారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ మాట్లాడుతూ ఖమ్మంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య ఓ కొలిక్కి వచ్చిందని పేర్కొన్నారు. ఈసందర్భంగా మహాసభల లోగోను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావుతో పాటు అమరవాది రవీంద్రశేషు, మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, నర్వనేని వెంకటరావు, ఖదీర్, ఆవుల శ్రీనివాసరావు, కనకం సైదులు, నలజాల వెంకటరావు, మైస పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాసరావు, మొహినుద్దీన్, పురుషోత్తం, శివానంద, జనార్థనాచారి, ఏలూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన


పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

సీపీఐ రాజకీయ శిక్షణ తరగతుల్లో వక్తలు

ఖమ్మంమయూరిసెంటర్: పోరాటాలతోనే హక్కులు సాధించుకోవచ్చని... పోరాడకుండా ఎప్పుడు కూడా ప్రజా అనుకూల చట్టాలు రాలేదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ యూసూఫ్ అన్నారు. అయితే, దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హరించివేసిందని ఆరోపించారు. ఖమ్మంలో జరుగుతున్న సీపీఐ రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం ఆయన 'లేబర్ కోడ్స్ – కార్మిక వర్గంపై ప్రభావం' అంశంపై మాట్లాడారు. దేశంలో తొలిసారి 1827లో పల్లకీ మోసే బోయిలు, ఆత్వ్రాత పడవులు నడిపేవారు సమ్మె చేశారని.. ఇదే అనేక సమ్మెలు, ఆందోళనలకు ఊపిరి పోసిందని తెలిపారు. కాగా, ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు హక్కుల కోసం అనేక పోరాటాలను నిర్వహించినట్లు చెప్పారు. ఇక మోదీ ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపడమే కాక కార్మిక చట్టాలను సవరించారని ఆరోపించారు. అనంతరం నాగపూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ యుగల్ రాయల్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు వివిధ అంశాలపై మాట్లాడారు. తొలుత సీపీఐ జెండాను ఆవిష్కరించగా, పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, యర్రా బాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధి, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం


ఈయూ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ అభివృద్ధితో పాటు ఉద్యోగుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) పాటుపడుతోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీ.జీ.క్లెమెంట్ తెలిపారు. ఈయూ 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖమ్మం బస్ డిపో ఎదురుగా ఉన్న సంఘం కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర మరువలేనిదని చెప్పారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు మాట్లాడుతూ 2013 వేతన సవరణ చట్టానికి సంబంధించి 50శాతం బాండ్ల నగదుతో పాటు ఇతర బకాయిలు చెల్లించాలని కోరారు. ఈమేరకు సమస్యల సాధన కోసం ఈనెల 19న హైదరాబాద్‌లో మౌన ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తోట రామాంజనేయులు, గాదే లక్ష్మీనారాయణ, రావి శివరామకృష్ణ, పేరబోయిన మోహన్‌రావు, పిల్లి రమేష్, దేశబోయిన జగన్నాథం, బేతంపూడి బుచ్చిబాబు, హరినాథ్ బాబు, ధామాల లాజర్, భూషయ్య, ప్రసాద్, నాగరాజు, వీరయ్య, పిచ్చయ్య పాల్గొన్నారు.

ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మధిర: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. మధిర మండలం మల్లవరానికి చెందిన గొట్టం శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై మధిర నుంచి మల్లవరం వెళ్తుండగా ఖమ్మం నుంచి ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. సిరిపురం వద్ద జరిగిన ఈ ఘటనలో ఆయనకు తీవ్రగాయాలు కావడంతో మధిరలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అలాగే, ఎర్రుపాలెం మండలం చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన దంపతులు వారి మనవడు ప్రణీత్‌తో బైక్‌పై మధిరకు వస్తున్నారు. ఇల్లందులపాడు సమీపాన గుంతను తప్పించబోయి ప్రమాదవశాత్తు కింద పడడంతో ప్రణీత్‌కు గాయాలు కాగా ఆర్కే ఫౌండేషన్ అంబులెన్స్‌లో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 50మంది రక్తదానం చేయగా వైస్‌చైర్మన్ ఆర్.రవీందర్‌రావు, కార్యదర్శి గుదిమళ్ల సూర్యప్రకాశరావు పర్యవేక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు కొత్తా సత్యనారాయణరెడ్డి, నరసయ్య, రాధాకృష్ణ, జెల్లా వెంకటేశ్వర్లు, మూలగుండ్ల శ్రీహరి, గజేంద్రుల నాగేశ్వరావు, తాతా రాఘవయ్య, గట్టు మోహన్, ఆంజనేయులు, టి.వెంకటేశ్వర్లు, ఎం.డీ.గౌస్, సాయికుమార్, ఉప్పలయ్య, సిబ్బంది స్రవంతి, సింధు, లక్ష్మీ,శ్రావణి, మానస, సమత పాల్గొన్నారు.

రవికి ఉత్తమ రక్తదాత అవార్డు


హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్నన్న రవి

తిరుమలాయపాలెం: మండలంలోని సుద్దవాగు తండాకు చెందిన బానోతు రవి ఉత్తమ రక్తదాత అవార్డు అందుకున్నారు. ఇప్పటివరకు 52సార్లు రక్తదానం చేసిన ఆయనకు హైదరాబాద్ రాజ్‌భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అవార్డు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.వీ.కర్ణన్, గవర్నర్ కార్యాలయ ముఖ్య కార్యదర్శి అజయ్‌మిశ్రా, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ చంద్రమోహన్, ఖమ్మం ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జ్ బాలుతో పాటు మంచానాయక్, భాషబోయిన వీరన్న తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యపై దర్యాప్తు

ఎర్రుపాలెం: ప్రేమించిన వ్యక్తి మరో మహిళను పెళ్లి చేసుకున్నాడనే మనస్తాపంతో ఎర్రుపాలెం మండలం ములుగుమాడుకు చెందిన ఓ యువతి 11న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా, ఆమె రాసిన సూసైడ్‌నోట్ శుక్రవారం లభించింది. గ్రామానికి చెందిన షేక్ రెహనా బేగం(23) ఏపీలోని వీరులపాడు మండలం రంగాపురానికి ఇస్లావత్ క్రాంతికుమార్ ప్రేమించుకున్నారు. ఇటీవల క్రాంతి ఇంకో మహిళను వివాహం చేసుకున్నట్లుగా తెలియగా రెహనాబేగం ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై ఇప్పటికే ఎస్సై సురేష్ కేసు నమోదు చేయగా.. విచారణలో భాగంగా ఆమె రాసిన సూసైడ్ నోట్‌ను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. 'నా మరణానికి కారణం ప్రేమించిన వాడు మోసం చేయడమే కారణం' అని ఆమె రాసినట్లు తెలుస్తుండగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ మృతి


మహిళ మృతదేహం

తల్లాడ: తల్లాడ బస్టాండ్‌లో శుక్రవారం తెల్లవారుజామున మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. బస్టాండ్ పరిసరాల్లో కొన్నాళ్లుగా ఉంటున్న ఆమె మృతి చెందినట్లు తెలియడంతో ఎస్‌ఐ కొండల్‌రావు చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని మార్చురీకీ తరలించారు. కాగా, ఇటీవల కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించుకున్నట్లుగా ఓపీ చీటీ లభించగా పేరు లక్ష్మి అని ఉందని.. ఆమె ఈచూకీ తెలిసిన వివరాలు సంప్రదించాలని ఎస్సై సూచించారు.

శుభకార్యానికి వెళ్తూ.. అనంతలోకాలకు


లక్ష్మి (ఫైల్)

వేంసూరు: బంధువులతో కలిసి ఆనందంగా శుభకార్యానికి బయలుదేరిన మహిళ గమ్యానికి చేరలేదు. మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో కన్నుమూసింది. వేంసూరు మండలం భీమవరం సమీపాన శుక్రవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలు... మండలంలోని అడసర్లపాడుకు చెందిన పలువురు సత్తుపల్లి మండలం సిద్ధారంలో జరగనున్న వివాహ రిసెప్షన్‌కు ఆటోలో బయలుదేరారు. అయితే, వేంసూరు మండలం భీమవరం సమీపాన ఆటో డ్రైవర్ రాయిని తప్పించే ప్రయత్నం చేస్తుండగా పల్టీ కొట్టింది. ఈఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న కోటమర్తి లక్ష్మి(60) మృతి చెందగా, కంచపోగు గోపయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. మృతురాలికు భర్త, నలుగురు పిల్లలు ఉండగా ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

సత్తుపల్లిరూరల్: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని ఖననం చేయగా, ఆయన తల్లిదండ్రుల ఫిర్యాదుతో మృతదేహన్ని వెలికితీసి పోస్ట్‌మార్టం నిర్వహించారు. సత్తుపల్లి మండలం గంగారానికి చెందిన బండారి విజయ్‌కుమార్(38)కు అదే గ్రామానికి చెందిన విజయకుమారితో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఖమ్మంలో ఉంటూ కూలీగా పనిచేస్తున్న ఆయన ఈనెల 4న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో గంగారంలో బంధువులు ఖననం చేశారు. అయితే, విజయ్ మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆయన తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఖమ్మం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఎస్సై జి.సూరజ్, వైద్యులు రాథోడ్ వినాయక్, సత్తుపల్లి గిర్దావర్ జి.నరేష్ ఆధ్వర్యాన శుక్రవారం గంగారంలో మృతదేహాన్ని వెలికితీయించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.